క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించాలి



పొన్నూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాచవరం, పెదపాలెం గ్రామ పంచాయతీలలో ఆయన పర్యటించారు. గ్రామాల్లో ప్రారంభించిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిబంధనల ప్రకారం సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణం జరిగేలా నిరంతరం పనులను పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. పెదపాలెంలో అమృత సరోవర్ ట్యాంక్, పచ్చల తాడిపర్రులో హార్టీకల్చర్ ప్లాంటేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

గొడవర్రు(చేబ్రోలు): మండలంలోని గొడవర్రు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం మై ఛాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామజ్యోతి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గృహహింసలకు చెందిన మూడు అంశాలపై అవగాహన కల్పించారు. ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కె.ప్యారి జాను, ల్యాంప్ సంస్థ ట్రైనీ కోఆర్డినేటర్ ఎస్కే బాజీ పాల్గొన్నారు. సురక్షిత గ్రామ జ్యోతి కామిక్ బుక్స్ అందించారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి గ్రామంలోని వరద బాధితులకు రూ.40 లక్షల విలువ చేసే దుస్తుల కిట్లు పంపిణీ చేసినట్లు వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఇటీవల వరద ప్రాంతాల్లో ముంపునకు గురైన కొటికలపూడి గ్రామంలోని 3,000 కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. యూనివర్సిటీకి చెందిన 500 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వరద సహాయక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, డీన్లు, అధిపతులు అభినందించారు.

రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్‌గా జియా



పొన్నూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పొన్నూరు బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా తహసీల్దార్ జియా వుల్ హక్ నియమితులయ్యారు. శుక్రవారం కార్యాలయంలో సొసైటీ కార్యవర్గం తహసీల్దార్ జియాను కలసి సొసైటీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించాలని కోరడంతో ఆయన అంగీకరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, వి.వి.గుప్తా, కోశాధికారి కే ఆంజనేయులు, సభ్యులు పి.రవీంద్రనాథ్, తోట భాను ప్రసాదు, నన్నపనేని బాలకృష్ణ, తోట వెంకటేశ్వర్లు, జి.ఎం.ఎస్. గుప్తా, పి.గణేష్ కుమార్ పాల్గొని తహసీల్దార్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

28న డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్ నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్(0863–2224202)లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలు తమ స్థానిక సమస్యలైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సచివాలయ సేవలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 0863–2224202 నంబర్‌కి కాల్ చేసి నేరుగా కమిషనర్ దృష్టికి తమ సమస్యను తెలియజేయవచ్చన్నారు.

ఎరువు.. ధరల దరువు

- రైతుల నుంచి అదనంగా వసూలు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు



సీతారాంపురంలో సాగవుతున్న వరి పంట

పొన్నూరు: వ్యాపారుల అత్యాశ.. అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో రైతు అవసరాన్ని ఆసరాగా తీసుకుని ఎరువుల వ్యాపారులు ఒక్కో బస్తాపై రూ.65 అదనంగా వసూలు చేస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు దుకాణ నిర్వాహకులకు వ్యవసాయాధికారులు చేస్తున్న హెచ్చరికలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి.

అప్పును ఆసరాగా తీసుకుని..

సాధారణంగా రైతులు ఏటా వ్యాపారుల నుంచి ఎరువును అప్పుగా తీసుకుంటారు. పంట విక్రయించిన తర్వాత తిరిగి చెల్లిస్తుంటారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు పెద్దమొత్తంలో ఖర్చవుతుంది. చిన్న, సన్నకారు రైతులు వ్యాపారుల వద్ద ఖాతా తెరిచి అవసరమైనప్పుడల్లా ఎరువులను అప్పుగా తీసుకెళ్తుంటారు. దీన్ని ఆసరాగా తీసుకుని రైతుల నుంచి కొందరు వ్యాపారులు అదనంగా వసూలు చేస్తున్నారు. హోల్ సేల్ వ్యాపారులు రిటైలర్ల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. బిల్లుల్లో మాత్రం నిర్దేశిత ధరలు రాస్తున్నారు. ప్రస్తుతం వానలు కురవడంతో వరి సాగు ముమ్మరంగా సాగుతోంది. అదును దాటితే పంట దిగుబడి తగ్గిపోతుందనే భయంతో వ్యాపారులు చెప్పిన ధరకే కొనుగోలు చేస్తున్నారు.

అధిక ధరలకు కొనుగోలు చేశా..



పట్టణంలోని దుకాణంలో రెండెకరాల వరి సాగుకు కావాల్సిన ఎరువు కొనుగోలు చేశా. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు దుకాణ నిర్వాహకులు చెప్పిన ధరకు కొనుగోలు చేయక తప్పడం లేదు. పెట్టుబడులు పెరుగుతున్నాయి.

– శ్రీనివాస్, రైతు, సీతారాంపురం, పొన్నూరు మండలం

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు



మండలంలోని 7 సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉంది. నిర్దేశిత ధరలతోనే ఎరువులు విక్రయించాల్సి ఉంటుంది. అధిక ధరలకు విక్రయాలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం. అదనంగా వసూలు చేసినట్లు తేలితే చర్యలు తప్పకుండా తీసుకుంటాం. రైతులు నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు. కొనుగోలు చేసే ప్రతి రైతు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.

– వెంకట్రామయ్య, మండల వ్యవసాయ అధికారి, పొన్నూరు

కృత్రిమ కొరత సృష్టించి..



పొలంలోకి తీసుకువెళుతున్న ఎరువులు

పొన్నూరు మండలంలో 26 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. రైతుల కోసం ప్రతి సొసైటీలో యూరియా అందుబాటులో ఉందని, అధికారులు చెబుతున్నా, రైతులు మాత్రం వ్యాపారుల వద్ద ఎరువులు కొనుగోలు చేయక తప్పడం లేదు. వ్యాపారులు స్టాక్ లేదని.. ధరలు పెంచి అమ్ముతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఉద్దేశపూర్వకంగానే కృత్రిమ కొరత సృష్టించి.. సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తా రూ.266కు విక్రయించాల్సి ఉండగా.. రూ.330 వరకు వసూలు చేస్తున్నారు. డీఏపీ రూ.1350కు గాను రూ.1450కు అమ్ముతున్నారు. ఒక్కో బస్తాపై రూ. 65 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేయడంతో ఒక్కో రైతుపై పొలం విస్తీర్ణాన్ని బట్టి వేలల్లో అదనపు భారం పడుతోంది.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



సీతారామిరెడ్డిని పరామర్శిస్తున్న బలసాని

గుంటూరు రూరల్: ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఇటీవల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో వాహనంపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాయపడిన వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి వంగా సీతారామిరెడ్డిని ఆయన నివాసంలో పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భరోసా కల్పించి త్వరితగతిన కోలుకోవాలని కోరారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన



లక్ష్మీపురం(కాకుమాను): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని తెలగాయపాలెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్‌పై ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రతి రోజు ఒక గంట వరకు విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గేరా ఏసేబు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగను కలిసిన దర్శకుడు దిలీప్‌రాజా

నగరంపాలెం: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా కలిశారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయనతో సమావేశమై, జగ్జీవన్‌రామ్ చిత్రంలోని సన్నివేశాలపై చర్చించారు. క్షేత్ర స్థాయిలో జరిగిన యదార్థ సన్నివేశాలపై దృష్టిసారించామని దర్శకుడు ఆయనకు వివరించారు. ప్రవాస భారతీయుడు డాక్టర్ చందోలు నాగమల్లేశ్వరరావు నిర్మిస్తున్నారని అన్నారు. వచ్చేనెల తొమ్మిది నుంచి రెండో షెడ్యూల్ చిత్రీకరణ తెనాలిలో జరుగుతుందని వివరించారు. అదే షెడ్యూల్‌లో మంద కృష్ణమాదిగ నటించనున్నానని దర్శకుడు తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ జైళ్లకు వెళ్లిన సన్నివేశాల చిత్రీకరణ జరగాల్సి ఉందన్నారు. ఈ చిత్రంలో ఏపీలోని ముగ్గురు ఎమ్మెల్యేలు నటించనున్నారని చెప్పారు. చిత్ర సమర్పకుడు చందోలు దేవదాసు, సమన్వయకర్త కాలేబ్‌రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే రామాంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుంటూరు రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీరింగ్, ప్రజారోగ్య, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం ఉందని, ప్రతి పని నిర్దేశిత టైం లైన్ మేరకు పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గోరంట్ల కొండ మీద సాగుతున్న రిజర్వాయర్ నిర్మాణ కాంట్రాక్టర్‌ని పిలిచి పనులను వేగంగా చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపాలన్నారు. బకాయిల వసూళ్లతో పాటు లే అవుట్‌ల వారీగా వివరాలు తీసుకొని ఖాళీ ప్లాట్‌లకు ఖాళీ స్థల పన్ను విధించడం ద్వారా జీఎంసీకి ఆదాయం వస్తుందని తెలిపారు. నగర పరిధిలో అనధికార వెంచర్లు పెరుగుతున్నాయని, పట్టణ ప్రణాళిక అధికారులు వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, సిటీ ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి



చేబ్రోలులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసశర్మ వేదికపై ఎంపీపీ, ఎంపీడీఓ

చేబ్రోలు: అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు చేబ్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాహితి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దారు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఎమ్మెల్సీ, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం 52 దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో 326 దరఖాస్తులు అందాయని వీటిపై వెరిఫికేషన్ జరుగుతున్నట్లు తెలిపారు. మండలంలోని 40 రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు పంపిణీ జరుగుతున్నట్లు తెలిపారు. సమగ్ర భూ సర్వే నిర్వహించిన మీసరగడ్డ అనంతవరంలో గ్రామసభలు నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించినట్లు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయశాఖ ద్వారా సూచనలు, సలహాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వరిలో తెగుళ్ల నివారణపై రైతులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్రహం లింకన్ మాట్లాడుతూ వైద్యశాలలో అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వేజండ్ల–1 ఎంపీటీసీ షేక్ బాషా మాట్లాడుతూ వేజండ్లలో కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. గురువారం ఒక్క రోజే ఆరుగురు కుక్కకాటుకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. కుక్కల నుంచి గ్రామస్తులను రక్షించాలన్నారు. ఏపీఓ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. 9,354 మందికి జాబ్ కార్డులు ఉన్నట్లు తెలిపారు. గొడవర్రు గ్రామ సర్పంచి బీరం జానికీదేవి మాట్లాడుతూ గ్రామంలో గోకులం షెడ్లు కోసం గ్రామ సభ ఆమోదం పొందిన దానికి భిన్నంగా ఎంపిక జరగటంపై ప్రశ్నించారు. గ్రామసర్పంచి సంతకం లేకుండా మీ ఇష్టం వచ్చినవారికి మంజూరు చేయటం ఎందుకు జరిగిందని గ్రామంలో వివాదానికి ఏపీఎం కారణమవుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. హౌసింగ్ ఏఈ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ గృహ నిర్మాణాల లబ్ధిదారుల పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు మంజూరు అవుతున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు అడ్వాన్స్ బిల్లులు పొందిన పనులు చేపట్టని వారిపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి అని తహసీల్దారు ప్రశ్నించారు. వారికి మొదటగా నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. గొడవర్రు సర్పంచి జానకీదేవీ మాట్లాడుతూ 2014–19లో ఇళ్లు నిర్మించిన కొంతమందికి బిల్లులు రాలేదని ప్రస్తుతం వాటికి మంజూరు అవుతాయా లేదా అన్ని ప్రశ్నించారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ ఎన్టీఆర్ రూరల్ స్కీం కింద బిల్లులు ఆగిపోయినట్లు వివరించారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో సర్వే జరుగుతుందని ప్రత్యేక యాప్ ద్వారా ప్రస్తుత పొజిషన్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అంచనా నిమిత్తం లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నామని డబ్బులు ఎంత అవసరమవుతాయా తెలుసుకొని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

స్ఫూర్తి నింపిన టెడ్-ఎక్స్ వీవీఐటీ



కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని: వీవీఐటీ విద్యార్థులతో నిర్వహించిన టెడ్ ఎక్స్–వీవీఐటీ విద్యార్థులలో స్ఫూర్తిని నింపి, ప్రేరణ కలిగించే విధంగా సాగిందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన టెడ్ ఎక్స్ కార్యక్రమంలో శుక్రవారం ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన తొమ్మిది మంది వారి జీవితానుభవాలను తెలిపి, వారు అధిగమించిన సవాళ్లను విద్యార్థులకు వివరించారు. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని అధిగమించి ఏవిధంగా ముందుకు సాగాలో తెలియజేస్తూ వక్తలు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్టసమయాలలో సరైన మార్గాలు ఎన్నుకునే విధంగా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. కార్యక్రమంలో వక్తలుగా సినీ దర్శకుడు విద్యాధర్ కటిగ, లెంట్రా చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ వికాస్ మెథోక్, ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ శివానంద్‌రెడ్డి, శ్యాంగ్‌శంగ్ సీనియర్ స్టాఫ్ ఇంజనీర్ శాఘత భట్టాచటర్జీ, ఫొరెన్సిక్ ప్రొఫెషనల్ త్రిషితా చటర్జీ, పర్యావరణవేత్త, ప్రొఫెసర్ డాక్టర్ అజయ్ కాట్రగడ్డ, వివిఐటి విద్యార్థులు సువిధ, భరత్‌లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థినులు



వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, పీఈటీ

వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సత్యసాయి జిల్లా హిందూపురంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టులో పాల్గొని ప్రథమ స్థానం పొందటంలో కీలక పాత్ర పోషించి వేజండ్ల హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు మట్టుపల్లి సుమశ్రీ, మట్టుపల్లి జయ సంజన, పఠాన్ సాహెద్‌లను ఎంపిక అయ్యారు. వీరు నవంబరు 4 నుంచి 9వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలలో వేజండ్ల హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్ఎం టి.విజయశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ రబియానప్పా అభినందించారు.

విచక్షణా రహితంగా పురుగుమందులు వాడొద్దు



పెదకాకానిలో అవగాహన కల్పిస్తున్న డీడీఏ వెంకటేశ్వర్లు

పెదకాకాని: మినుము, పెసర వంటి అపరాల సాగులో పురుగు, తెగుళ్లు, దోమ నివారణకు రైతులు విచక్షణా రహితంగా పురుగుమందులు పిచికారి చేయవద్దని వ్యవసాయ కార్యాలయం డీడీఏ డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గ్రామంలో శుక్రవారం రైతులతో కలసి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు అనంతరం సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు మినుము, పెసర వంటి పైర్లకు నాలుగు నుంచి ఐదు రకాల మందులు కలిపి పిచికారి చేయడం వలన మినుము పంటలో ఆకులు గోధుమ రంగులోకి మారిపోతున్నాయని ప్రయోగాత్మకంగా రైతులకు చూపించారు. గోధుమ రంగులోకి మారిన మినుము పంటకు పొటాషియం నైట్రేట్ ఎకరానికి కిలో చొప్పున తగు మోతాదులో నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్, ఏఓ పి.సంధ్యారాణి, వ్యవసాయ విస్తరణాధికారులు ఆర్‌వీ శివాజీ, ఎస్.వెంకటశివరావు, వీఏఏలు వి.లక్ష్మి, ఎ.పూర్ణసాయిరామ్, ఎస్కే షాహినా పాల్గొన్నారు.

మాన్యువల్‌గా అప్లికేషన్లు తీసుకోబడవు

- ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తుకు చుక్కలు చూపిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది
- ఆన్ లైన్ చేసి తీసుకొస్తేనే దరఖాస్తు స్వీకరిస్తామని స్పష్టం



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం బయట వేచి ఉన్న పట్టభద్రులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పట్టభద్రులకు చుక్కలు చూపిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు మాన్యువల్‌గా ఇచ్చే దరఖాస్తులను తీసుకోకుండా వెనక్కు పంపుతున్నారు. మీరు ఆన్‌లైన్ చేసుకొస్తేనే దరఖాస్తులు తీసుకుంటామని తెల్చి చెబుతుండటంతో పట్టభద్రులు ఇంటర్ నెట్ సెంటర్లు.. రాజకీయ శిబిరాల వద్దకు వెళుతున్నారు.

కృష్ణా– గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చిలో జరగున్నాయి. ఎన్నికల్లో ఓటు హక్కును పొందాలంటే పట్టభద్రులు ఫారం– 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు మాన్యువల్‌గా దరఖాస్తును పూరించి తహశీల్దార్ కార్యాలయంలో ఇస్తే, అక్కడి సిబ్బంది సర్టిఫికెట్లు పరిశీలించి, ఆన్‌లైన్ చేసి అర్హతను బట్టి ఓటు హక్కును కల్పించనున్నారు. కానీ స్థానిక తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది మాత్రం పని భారం నుంచి తప్పించుకునేందుకు సర్వర్ సమస్యను సాకుగా చూపుతున్నారు. మా కార్యాలయంలో సర్వర్ రావడం లేదు.. బయట ఇంటర్‌నెట్ సెంటరులో లేదా మరెక్కడైనా ఆన్‌లైన్ చేసుకుని స్లిప్ తీసుకుని రావాలని సూచిస్తున్నారు. దీంతో దిక్కు తోచక దరఖాస్తు చేసుకుందామని కార్యాలయానికి వెళ్లిన వారు ఈ తలనొప్పి అంతా మాకెందుకు బాబోయ్ అంటూ కాళ్లకు పని చెప్పి ఇంటికి వెళ్లిపోతున్నారు. కాగా మరికొందరు రెకమండేషన్ చేయించుకుని కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తులు అందిస్తున్నారు.

ఇందుకోసమేనని ఆరోపణలు..

ఇదిలా ఉంటే తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఇలా ఆన్‌లైన్ పేరుతో మాన్యువల్ దరఖాస్తులను స్వీకరించకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు దరఖాస్తులు ఆన్‌లైన్ చేసేందుకు వారి పార్టీ కార్యాలయం వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థుల దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మాన్యువల్ దరఖాస్తు స్వీకరించకుండా వెనక్కు పంపితే వారు స్థానిక టీడీపీ కార్యాలయానికి వెళ్లి తమ దరఖాస్తులు, సర్టిఫికెట్లు, అందించి ఆన్‌లైన్ చేయించుకునే అవకాశం ఉంది. అందుకే కార్యాలయ సిబ్బంది వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ప్రతిపక్ష పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నాయి. దరఖాస్తుకు సమయం మరో పది రోజులు మాత్రమే ఉంది.

సర్వర్ సమస్య వలన..

ఎమ్మెల్సీ ఓటుకు వచ్చే దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఆన్ లైన్ చేయడానికి సర్వర్ సమస్య వస్తుంది. అందుకే మాన్యువల్‌గా దరఖాస్తులు తెచ్చిన వారిని బయట ఆన్‌లైన్ చేసుకుని తీసుకుని రమ్మంటున్నాం. మరలా మా కార్యాలయంలో సర్వర్ రాకపోతే వాళ్లు ఓటు కోల్పోయే అవకాశం ఉంది. అందుకే అలా వెనక్కు పంపుతున్నాం. బయట ఆన్‌లైన్ చేయించుకోవడం రాని వాళ్లకు మేమే ఆన్ లైన్ చేస్తాం.

– ఎం.మాణిక్యరావు, సీనియర్ అసిస్టెంట్, మండల ఎన్నికల విభాగం

ఎరువుల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు



పీఏసీఎస్ ప్రతినిధులతో శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాం ఫాం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘం ప్రతినిధులకు సమగ్ర యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు తరగతులు శుక్రవారం నిర్వహించారు. 15 రోజులపాటు జరిగే ఈ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవాన్ని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(ఏడీఆర్) డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయం, సమేతి, మేనేజ్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఎరువుల వాడకంలో మెలకువలు, జాగ్రత్తలు, ప్రాథమిక సంఘాల ద్వారా రైతులకు సమాచారం వెంటనే చేరుతుందన్నారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బి.ముకుందరావు, డాక్టర్ వి.విశాలక్ష్మి, డాక్టర్ ఎం.వెంకటరాములు పాల్గొన్నారు.